మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

సునీతా విలియమ్స్ భూమ్మీదకు.. మేడిగడ్డను బాగుచేయలేరా?

- కేసీఆర్ పాలన విధ్వంసం కాదు అద్భుతం
- నాడు తెలంగాణ అన్నింటా ముందుండె
- నేడు కాంగ్రెస్ పాలనలో దగా
- ఆసరా పింఛన్ల పెంపు అంశానికి మంగళం
- విద్య, వైద్య రంగాలపై బడ్జెట్‌లో నిర్లక్ష్యం
- చేనేత కార్మికుల సంక్షేమానికి సర్కార్ తూట్లు
- శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చలో మధుసూదనాచారి

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): 'అంతరిక్షంలో 9 నెలల పాటు చిక్కుకున్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ను భూమి మీదికి సురక్షితంగా రప్పించిన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నేటి తరుణంలో.. కాళేశ్వరం మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతులు చేయలేరా? అని శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూధనాచారి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడిగడ్డ పిల్లర్లు మరమ్మతులే కావు.. అనే మాటతో ఒక గొప్ప ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోకపోవడం సరికాదని హితవు పలికారు. దీనిని వదులుకోవడం బాధాకరమని, కాళేశ్వరం ఒక అద్భుతమైన భారీ ప్రాజెక్టు అని అభివర్ణించారు. అందులో అంతర్భాగం మేడిగడ్డ అని, దానిలో ఓ మూడు పిల్లర్లు కుంగాయని తెలిపారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్ పద్దు శుక్రవారం శాసనమండలిలో ప్రారంభమైన చర్చలో బీఆర్‌ఎస్ తరపున ఆయన మాట్లాడారు. నాడు కొట్లాడి తెలంగాణను సాధించిన కేసీఆర్.. కాళేశ్వరం లాంటి అద్భుతమైన భారీ ప్రాజెక్టు కడితే.. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పిల్లర్లను మరమ్మతు చేయించలేదా? అని సూటిగా ప్రశ్నించారు. 'ఒక బలిష్టమైన ఏనుగు తోకకు ఏదో గాయమైతే.. ఆ ఏనుగు పనైపోయిందని ప్రచారం చేసినట్టుంది.. అని ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టును ఓ పిట్ట కథతో పోల్చి చెప్పి ఆలోచింపజేశారు. తెలంగాణ దార్శనికుడు కేసీఆర్ హయాంలో తెలంగాణలో అద్భుతమైన జలకళ తొణికిసలాడిందని, నేడు కాంగ్రెస్ పాలనలో దుర్భిక్షం నెలకొన్నదని విమర్శించారు. నాడు కేసీఆర్ పాలన విధ్వంసం కాదని, అద్భుతాలు సాధించిన ప్రగతిపథం అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక 24 గంటల విద్యుత్తు సరఫరా, సాగు, తాగునీరు అందించి తెలంగాణను సస్యశ్యామలం చేసిన మహనీయుడని కొనియాడారు.

ఆరు గ్యారెంటీలను అటకెక్కించిన సర్కార్

ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు అని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని ఇప్పుడు అమలు చేయలేక అటకెక్కించిందని మధుసూధనాచారి తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో రెండో విడుత గొర్రెలు పంపిణీ చేస్తామన్నారని, పంపిణీనే మరిచారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షల ఆర్థికసాయం అందిస్తామన్న కాంగ్రెస్ పాలకులు వాటి గురించి ఇప్పుడు మాట్లాడటమే మరిచారని కాంగ్రెస్ సర్కారు తీరుపై విరుచుకుపడ్డారు. ఆసరా పింఛన్ల పెంపునకు మంగళం పాడి, చేయూతకు తూట్లు పొడిచారని, ఇతర అన్ని రకాల హామీలను కాలరాశారని దుయ్యబట్టారు. తండాల అభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తామని ప్రకటించినా నేటికీ ఇవ్వనేలేదని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల్లో విద్యా, వైద్యా రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. సర్కారు దవాఖానలల్లో దూదీ లేదు.. సూది లేదు.. మందు లేదు.. మంచం లేదు.. అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో విరాజిల్లిన ప్రభుత్వ గురుకులాలు.. కాంగ్రెస్ పాలనలో కునారిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులు పాముకాటుకు గురైనా పట్టించుకోని సర్కారు ఇప్పుడు రాజ్యమేలుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్‌పై స్పష్టతే లేదని విమర్శించారు. బడ్జెట్‌లో మేం అడిగిన క్లారిఫికేషన్స్‌కు మంత్రి నుంచి ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదు.

శాసనమండలి ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, నవీన్‌కుమార్, శేరి సుభాష్‌రెడ్డి, తాతా మధు, యాదవరెడ్డి తదితరులు

అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం

- కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలు, గ్యారెంటీలు ఏమయ్యాయి?
- శాసనమండలిలో ప్రశ్నోత్తరాలను రద్దు చేయడం తీవ్రఅన్యాయం
- సభలో అవకాశం లేకున్నా ప్రజాక్షేత్రంలో పోరాడుతాం: సిరికొండ
- కేసీఆర్ హయాంలో అప్పులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం: కవిత
- మండలిలో బీఆర్‌ఎస్ నిరసన, అప్పులపై శ్వేతపత్రానికి డిమాండ్

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు రద్దు చేయడాన్ని మండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఖండించారు. ప్రభుత్వం ప్రజాసమస్యలు చర్చించడంలేదని, కేవలం బిల్లులు ప్రవేశపెట్టి, పాస్ చేయించుకుంటున్నదని మండిపడ్డారు. ప్రశ్నోత్తరాల వల్ల ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే అవకాశముంటుందని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శించారు. తూతూమంత్రంగా సభను నడిపిస్తున్నారని, పనిగంటలు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో చర్చించే అవకాశం లేకున్నా ప్రభుత్వ వైఖరిపై ప్రజాక్షేత్రంలో పోరాడుతామని స్పష్టంచేశారు.

కేసీఆర్‌ను బద్నామ్ చేస్తున్నారు: కల్వకుంట్ల కవిత

కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో రూ.1.58 లక్షల కోట్ల అప్పు చేసినట్టు చెప్తున్నదని, 9 ఏండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు కేవలం రూ.4.17లక్షల కోట్లు మాత్రమేనని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అప్పుల విషయంలో పదేపదే కేసీఆర్‌ను బద్నామ్ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తూ, సభను, ప్రజలను తప్పు పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ప్రతీ అప్పునకు సరైన లెక్కలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు.

సర్కారుపై నిరసన గళమెత్తిన బీఆర్‌ఎస్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శాసనమండలి ఆవరణలో మండలి విపక్షనేత మధుసూదనాచారి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. 'అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'అప్పులు ఆకాశంలో, అభివృద్ధి పాతాళంలో' అంటూ నినాదాలు చేశారు. రూ.1.58లక్షల కోట్ల అప్పుచేసి, ఎంతమంది మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, ఆడపిల్లలకు స్కూటీలు ఇచ్చారని, తులం బంగారం ఇచ్చారని నిలదీశారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో రూ.1.58 లక్షల కోట్లు అప్పుచేసినా అభివృద్ధి మాత్రం సున్నా అని విమర్శించారు.

అవినీతి, మోసానికి ప్రతీక బడ్జెట్

- అబద్ధాలలో సీఎం గిన్నిస్ రికార్డు
- ఈ ప్రభుత్వానికి ఎలాంటి విజన్ లేదు
- రాష్ట్ర బడ్జెట్‌పై మండలిలో కల్వకుంట్ల కవిత విమర్శ

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాంగ్రెస్ మార్క్ కరప్షన్‌కు, కాంగ్రెస్ మార్క్ కన్నింగ్‌నెస్‌కు పర్ఫెక్ట్ బ్లాక్ అండ్ వైట్ ప్రూఫ్ అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రాష్ట్ర అప్పుల విషయంలో పదేపదే అద్భుతంగా అబద్ధాలు చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇవాలో, రేపో గిన్నిస్ రికార్డు ఇచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. శాసనమండలిలో శుక్రవారం జరిగిన బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న కవిత.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం, మంత్రులు చెప్తున్న అబద్ధాలను ఎత్తిచూపారు. రాష్ట్రానికి చోదకశక్తిగా ఉండాల్సిన ముఖ్యమంత్రి నేషనల్ మీడియాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అబద్ధాలు చెప్తూ తెలంగాణ పరువు తీస్తున్నారని మండిపడ్డారు. 'మూలధన వ్యయం కింద నెలకు రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోతున్నామని సీఎం అంటున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం కాలంలో మూలధన వ్యయం కింద మొత్తం రూ.33,087 కోట్లు ఖర్చు చేసింది. అంటే నెలకు సగటున రూ.2,750 కోట్లు ఖర్చు చేశారు. ముఖ్యమంత్రికి ఈ విషయం తెలిసి కూడా కేవలం బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను బద్నాం చేయడానికే నెలకు రూ. 500 కోట్లు ఖర్చు చేయలేకపోతున్నామని అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు అప్పులపై అబద్ధాలు బంద్ చేయాలని, లేకుంటే ఈనెల 27న సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రాధాన్య రంగమేది?

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రాధాన్యాలేమిటో ఎవరికీ అంతుపట్టడంలేదని కవిత విమర్శించారు. మొదటి బడ్జెట్‌లో కేసీఆర్‌ను తిట్టి , రెండో బడ్జెట్‌లోనూ కేసీఆర్‌నే తిడతామంటే ప్రజలు మెచ్చరని చెప్పారు. 'మీ తిట్లతో ప్రతిపక్ష పార్టీగా మాకు వచ్చే నష్టమేమి లేదు. మీరెన్ని తిట్లు తిట్టినా మీ మీద పోరాటం చేసే మేము తెలంగాణ తెచ్చుకున్నాం' అని అన్నారు. ఈ ప్రభుత్వానికి ఎలాంటి విజన్ లేదని విమర్శించారు.

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068.
ఫోన్ నం.లు 040-29803086/3186, ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో : అమరావతి వద్ద (ప్రారంభ అధికార పరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
M/s. శ్రీ పూజిత చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
కంపెనీ పిటీషన్ నం. 28/2010
ఇ-వేలం ద్వారా అసెట్లు/ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

అమరావతి వద్ద గల గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం C.A.No.9/2022లో I.A.No.1/2025లో 30-01-2025 తేదీనాటి ఉత్తర్వు ప్రకారం, కాగోరు కొనుగోలుదారులు నుండి **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదిక"**పై కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క దిగువ అసెట్లు/ఆస్తులు అమ్మకానికి సంబంధించి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.
అసెట్లు/ఆస్తులు, రిజర్వు ధర, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం యొక్క వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

అసెట్లు/ఆస్తుల వివరణ	రిజర్వు ధర (రూ.లక్షల్లో)	బయానా (EMD) (రూ.లక్షల్లో)	బిడ్ పెంపుదల మొత్తం (రూ.)
ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, గవర్నర్‌పేట్, ప్రకాశం రోడ్, అమ్మన ఎస్టేట్స్, డోర్ నం. 29-36-37, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో సౌత్ ఈస్ట్ ఆఫీస్ బ్లాక్ వద్ద గల 1923 చదరపు అడుగుల (కామన్ ఏరియా కలుపుకుని) విస్తీర్ణం గల ఆర్‌సిసి రూఫ్డ్ కమర్షియల్ బ్లాక్ మరియు మెషినరీ, ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్, విండో/ స్ప్లిట్ A/C, సేఫ్టీ లాకర్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ & ఆఫీస్ ఎక్విప్‌మెంట్ మొదలగువాటితో సహా	106	10.60 (వడ్డీ చెల్లించబడదు)	30,000/-

గమనిక:
i. 04-04-2025 & 05-04-2025 తేదీలలో ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం.మధ్య పై అసెట్లు/ఆస్తులను తనిఖీ చేసుకోవచ్చు.
ii. ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరుదారులు **అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్** అనగా **"EMD ACCOUNT"**, కరెంట్ అకౌంట్ **No.0207002100146966**, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, **IFS కోడ్: PUNB0020700**లో RTGS/NEFT విధానం ద్వారా **రూ. 2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే)** వాపసు ఇవ్వబడని మరియు సర్దుబాటు చేయబడని ఇ-వేలం పార్టిసిపేషన్ రుసుము మరియు పైన తెలిపిన **బయానా మొత్తం (వడ్డీ లేదు)** చెల్లించాల్సి వుంటుంది. పార్టిసిపేషన్ రుసుము మరియు బయానా మొత్తం డిపాజిట్ చేయుటకు ఆఖరి తేది **21-04-2025న సా. 4.00 గం. వరకు.** మరియు మద్దతు డాక్యుమెంట్లుతో పాటు ఆన్‌లైన్ ఆఫర్ /బిడ్ ఫారం దాఖలు చేయుటకు ఆఖరి తేది **22-04-2025న సా. 4.00 గం.వరకు.**
iii. టెండరుదార్లు వెబ్‌సైట్: **https://ol.auctiontiger.net** ద్వారా తమ ఆన్‌లైన్ ఆఫర్ దాఖలు చేయాలి. అఫీషియల్ లిక్విడేటర్ వారు ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య, నెట్‌వర్క్ సమస్య, సిస్టమ్ క్రాష్ డౌన్, విద్యుత్ వైఫల్యం మరియు అటువంటి ఇతర కారణాలకు బాధ్యత వహించరు.
iv. ఇ-వేలం గురించివివరాలు/సహాయం/విధానం/ఆన్‌లైన్ శిక్షణ కొరకు కాగోరు బిడ్డర్లు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్)** కస్టమర్ కేర్ నంబర్‌పై సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చును. **మొబైల్ నం. +91 9722778828. ఇమెయిల్ ఐడి:** praveen.thevar@auctiontiger.net
v. పై ఆస్తుల/అసెట్ల ఇ-వేలం/బిడ్డింగ్ అర్హత గల బిడ్డర్ల మధ్య ఆన్‌లైన్ ఇంటర్-సె-బిడ్డింగ్ ద్వారా నిర్వహించబడును. సదరు బిడ్డర్లు "బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్" ద్వారా వారి ఆఫర్‌ను పెంచవచ్చును.
vi. ఇ-వేలం వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net** ద్వారా ఇ-వేలం అమ్మకం పూర్తి అయ్యేముందు చివరి నిమిషంలో బిడ్ వేయబడితే ప్రతిసారీ 10 నిమిషాల ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్‌తో **24-04-2025న ఉ. 11.30 గం. నుండి మ. 2.30 గం.** మధ్య నిర్వహించబడుతుంది.
vii. అమ్మకం గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, అమరావతి యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. అఫీషియల్ లిక్విడేటర్ మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏదైనా ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు వారి హక్కులు కలిగి ఉన్నారు.
viii. కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో ఆసక్తి కలిగిన సెక్యూర్డ్ క్రెడిటార్స్/అన్‌సెక్యూర్డ్ & ప్రిఫరెన్షియల్ క్రెడిటార్స్/కంట్రిబ్యూటర్స్/ఎక్స్-డైరెక్టర్స్/కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వ అథారిటీలు, గవర్నమెంట్/సెమి గవర్నమెంట్/స్థానిక సంస్థలు మరియు అన్ని ఇతర పార్టీలకు నోటీసుగా ఈ అమ్మకం ప్రకటనను పరిగణించవలెను.
ix. కాగోరు కొనుగోలుదారు ప్రతిపాదిత ఇ-వేలంలో పాల్గొనుటకు ముందు ఏవైనా అవసరమైన వాటికి సంబంధించి తమకుతాము పూర్తిగా సంతృప్తి పడేందుకు ప్రకటన తేది నుండి పైన తెలిపిన తనిఖీ తేది వరకు ఏదైనా పని రోజున **మ. 2.00 గం. నుండి మ. 3.00 గం.**మధ్య అఫీషియల్ లిక్విడేటర్, హైదరాబాద్ వారి కార్యాలయాన్ని దర్శించి సంబంధిత ఆస్తి డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చు మరియు రెవెన్యూ/సంబంధిత అథారిటీల నుండి నేరుగా సంబంధిత రెవెన్యూ రికార్డులు/లొకేషన్ మ్యాప్ కూడా పరిశీలించుకోవచ్చు. భవిష్యత్‌లో దీనికి సంబంధించి ఏదైనా అభ్యంతరం ఉంటే, దానిని అఫీషియల్ లిక్విడేటర్ పరిగణించజాలరు.
x. **అమ్మకం నియమ నిబంధనలతో**పాటు పై ఇ-వేలం యొక్క ఇతర వివరాలు వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net**లో లభిస్తాయి.
xi. పై నియమ నిబంధనలను ఏ సమయంలోనైనా గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం/అఫీషియల్ లిక్విడేటర్ ద్వారా సడలించవచ్చును/రద్దు చేయవచ్చును/తదుపరిగా పేర్కొనవచ్చును.

తేది: 19-03-2025
ప్రదేశం: హైదరాబాద్
సం/-
(U.K. సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

మంగళవారం కోసం సర్కారు ఎదురుచూపులు!

- అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని సంక్షోభం దిశగా తీసుకెళ్తున్నరు
- బడ్జెట్‌పై చర్చలో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, మార్చి21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మంగళవారం ఎప్పుడు వస్తుందా? అప్పులు ఎప్పుడు తెద్దామా? అని ఎదురుచూస్తున్నదని మండిపడ్డారు. ఆర్బీఐ వద్ద అప్పుల చేస్తూ రాష్ట్రాన్ని సంక్షోభం దిశగా తీసుకెళ్తున్నట్టు ఆరోపించారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో శుక్రవారం జరిగిన చర్చలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో హామీల ఎగవేతలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ప్రభుత్వం తెచ్చిన కరువని మండిపడ్డారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.20వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కోసం భూములు తాకట్టు పెట్టి రూ.40 వేల కోట్ల అప్పులు తెచ్చారని విమర్శించారు. అలాగే, అసెంబ్లీలో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. వీరిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీలు, అమలుపై పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. మోదీ ప్రతి పౌరుడి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారని శ్రీధర్‌బాబు విమర్శించగా, దీనిపై మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.15 లక్షల హామీని తమ పార్టీ మ్యానిఫెస్టోలో ఎక్కడా పెట్టలేదన్నారు. 'మీకు చేతగాకపోతే చేతగాదని చెప్పండి. అధికారం కోసం తప్పుడు హామీలిచ్చింది మీరు. ముక్కు నేలకు రాసి తప్పైందని ఒప్పుకోండి. పిచ్చిపిచ్చిగా మాపై నిందలు వేస్తే సహించేది లేదు.' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొని 'కేంద్ర ప్రభుత్వం మాదిరిగా హామీల అమలులో మేం వెనక్కి పోం.. రాసి పెట్టుకోండి' అంటూ శ్రీధర్‌బాబు సవాల్ విసిరారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టుపై సీఎం, మంత్రులు పూటకో మాట మాట్లాడుతున్నారని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు.

వ్యవసాయానికి 8 శాతమేనా?

బడ్జెట్‌పై చర్చలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అత్యధిక శాతం మందికి ఉపాధి కల్పించే వ్యవసాయ రంగానికి 2025-26 వార్షిక బడ్జెట్‌లో కేవలం 8% నిధులు కేటాయించడం ఏమిటని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ప్రశ్నించారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా తులం బంగారం ఇవ్వడం లేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తప్ప వేరే విషయాలు మాట్లాడొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనమండలి సాక్షిగా చెప్పారని, ప్రభుత్వాన్ని నడపడం అంత ఈజీ కాదని కాంగ్రెస్ నేతలకు తత్వం బోధ పడిందని ఎద్దేవా చేశారు. అప్పుల విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేయొద్దని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే రూ.1.58 లక్షల కోట్లు అప్పులు చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

హామీలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన: నవీన్‌కుమార్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సాగుతున్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయం, వైద్యం, విద్యారంగాల్లో తీసుకొచ్చిన మార్పులు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేశాయని చెప్పారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు సరిగా లేవని పేర్కొన్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి: ఎల్ రమణ

తెలంగాణ అమరుల కుటుంబాలను ఆదుకుంటామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ డిమాండ్ చేశారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన 'జితేనా బాగేదారి.. ఉత్నా హిస్సాదారి' నినాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికభారం పేరిట అనేక సంక్షేమ పథకాల అమలు నుంచి తప్పించుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు.

స్కూటీలు ఇస్తామని మాట తప్పారు: మంకెన కోటిరెడ్డి

ఎన్నికల ప్రచారంలో విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని కానీ, బడ్జెట్‌లో ఆ అంశాన్ని ప్రస్తావించపోవడం ఏమిటని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగించడం లేదని విమర్శించారు. రైతుభరోసా విషయంలోనూ ప్రభుత్వం మాటతప్పిందని దుయ్యబట్టారు. విద్య, వైద్య రంగాలకు సైతం సరిపడా నిధులు కేటాయించలేదని మండిపడ్డారు.

కేటాయింపులకు, హామీలకు పొంతన లేదు

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ) : బడ్జెట్‌లో కేటాయింపులకు, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు పొంతన కుదరడం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. మండలిలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవని, మనఊరు-మనబడి పాఠశాలల నిర్మాణాల బకాయిలు చెల్లించాలని కోరారు. తెలంగాణ కళాకారుల వేతనాల పెంపు ప్రస్తావన లేదని పేర్కొన్నారు. దళిత బంధు ప్రస్తావన లేదని, వైద్య ఆరోగ్యానికి కేటాయింపులు తగ్గాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గాలికి కాంగ్రెస్ 1994లో మాదిరిగా కొట్టుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల తీరు ఆహా నా పెళ్ళంట సినిమాలో కోటా శ్రీనివాస్ సీనుకు మించిపోయాయని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తెలిపారు.

ఆటిజం బాధితులకు కేటాయింపులు చేయాలి : ఎమ్మెల్సీ వాణీదేవి

ప్రత్యేక అవసరాలు ఉన్న వర్గాలకు ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. ఆటిజం(బుద్ధిమాంద్యం) 22 ఏండ్ల క్రితం వెయ్యి మందిలో ఒక్కరికి ఉండే లక్షణాలు.. ఇప్పుడు 64కి పెరిగిందని వాపోయారు. రాబోయే రోజుల్లో ఇది మరింత పెరిగే ప్రమాదమున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. టెక్నికల్ విద్యా విధానంలో తొందరపాటు వద్దని అన్నారు. సమాజ శ్రేయస్సు గురించి ఆలోచించే బ్రాహ్మణ వర్గానికి బీఆర్‌ఎస్ పాలనలో బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటుచేసి, అన్ని విధాలా సహకారం అందించారని గుర్తుచేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి: మహమూద్ అలీ

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని తెలిపారు. బడ్జెట్‌లో మైనార్టీలకు కేటాయింపులు సరిపోవని పేర్కొన్నారు. షాదీముబారక్ అమలులో లేదని, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు లేవని తెలిపారు. కేసీఆర్ పాలనలో మైనార్టీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు.

గిరిజనులకు అన్యాయం:మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం జరిగిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వాపోయారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో గిరిజన తండాలు, గూడెంలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజన మంత్రి లేరని, గిరిజన గురుకులాలలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు.